క్లుప్తంగా

కళాశాలలో అకడమిక్ ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న సభ్యులు

తాడిపత్రి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అకడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. విజయలక్ష్మి తెలిపారు. ఏపీ కళాశాల విద్య కమిషనర్ ఉత్తర్వుల మేరకు అకడమిక్ సలహాదారులు అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డాక్టర్ జితేంద్ర, ఉవకొండ డిగ్రీ కళాశాల నుంచి డాక్టర్ రాజేష్ కళాశాలలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, న్యాక్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎగ్జిట్ సమావేశాన్ని నిర్వహించి న్యాక్‌లో ఉత్తమ గ్రేడ్ సాధించడానికి చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి యాదుల్లా ఉరుసు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట (కొత్తూరు) గ్రామంలోని చెరువు కట్టపై వెలసిన యాదుల్లా బాషా ఖాద్రీ 174వ ఉరుసు ఉత్సవాలు ఈ నెల 13 నుంచి ప్రారంభమవుతాయని దర్గా కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 13న గంధం, 14న ఉరుసు, 15న జియారత్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మౌల్వీలతో బయాన్ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి

గుత్తి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,600 వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. గుత్తిలో మంగళవారం విద్యార్థులు, ఐటీ వింగ్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఆరోగ్య శ్రీకి ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ చాలా అధ్వానంగా ఉందన్నారు. ఐటీ వింగ్ నాయకులు సూర్యకుమార్ రెడ్డి, హరినాథ్, విష్ణువర్దన్, తేజ పాల్గొన్నారు.

కార్మికుడికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు(యాడికి): యాడికి మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన ప్రకాష్ అనే యువకుడు బళ్లారి వద్ద హొస్పేట బీఎంఎం కర్మాగారంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..మంగళవారం తెల్లవారుజామున కంకర వేసుకొని లారీలో హొస్పేటకు వెళ్లాడు. అక్కడ బీఎంఎం కర్మాగారంలో కంకర హిటాచీ సాయంతో అన్‌లోడ్ చేస్తుండగా.. లారీలో ఉన్న ప్రకాష్‌కు హిటాచీ తగలడంతో తీవ్ర గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రున్ని బెంగళూరుకు తరలించినట్లు సమాచారం.

రైతు సమస్యలు త్వరగా పరిష్కరించండి


మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవ నాయుడు

బుక్కరాయసముద్రం: రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీఓ కేశవ నాయుడు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేసేలా వీఆర్‌ఓలు కృషి చేయాలన్నారు. భూ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, టీడీ రామక్రిష్టారెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్

పెద్దవడుగూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ వివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రీ సర్వే గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు సమస్యలతో కార్యాలయానికి వస్తే సంబంధిత వీఆర్వో స్పందించి పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి, డీటీ వెంకటేశ్వరమ్మ, రీ సర్వే డీటీ జయమ్మ, సర్వేయర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మొండిచెయ్యి



- నెలకు రూ.3 వేలు భృతి హామీకి మంగళం
- మరోసారి నిరుద్యోగుల నడ్డి విరిచిన చంద్రబాబు
- బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో 'కూటమి'పై యువత ఆగ్రహం

గుంతకల్లు: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే వరకూ నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కూటమి నేతలు ఆ హామీకి తొంగలోకి తొక్కారు. గుంతకల్లు నియోజకవర్గంలో దాదాపు 40 వేల మందికిపైగా నిరుద్యోగులు ఉన్నారు. చంద్రబాబు 2014లో ఎన్నికల మేనిఫెస్టోలో కూడా నిరుద్యోగ భృతి ప్రకటించి అమలు చేయలేదు. అదే తరహాలో 2024 ఎన్నికల్లో మరోసారి 'నిరుద్యోగ భృతి' ప్రకటించి అమలు చేయడంలో బాబు విఫలమయ్యాడు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని..ఇంటికో ఉద్యోగం ..ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇలా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.3,000 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానంగా చూపించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచిపెట్టి నిరుద్యోగుల్లో ఆశలు పెంచారు. ఎన్నికల సమయంలో పదో తరగతి, ఇంటర్ డిగ్రీ, పీజీ అనే నిబంధనలు ఏవీ చెప్పకుండా నిరుగ్యోగ భృతి ఇస్తామనడంతో అంతా నమ్మారు. కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా నిరుద్యోగ భృతిపై ఒక్కరూ నోరు మెదపడం లేదు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిపై బడ్జెట్‌లో సైతం ఎలాంటి ప్రకటన లేదు. కనీసం ఈ పథకం అమలుపై విధి, విధానాలు, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంపై నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పినట్లుగానే 2024లోనూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అదే ధోరణ ప్రదర్శిస్తుండంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని యువత డిమాండ్ చేస్తోంది.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ బాబూ...

గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోచింగ్, సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి చదువుకుంటున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతి అండగా నిలుస్తుందని ఆశ పెట్టుకున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే ఎక్కువ శాతం డిగ్రీ, పీజీ చేసిన యువత అనంతపురం, విజయవాడ, కర్నూలు, హైదరాబాదు, గుంటూరు నగరాల్లో స్టడీ సెంటర్లలో చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రమాణ స్వీకారం రోజు చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి, ఇప్పటి వరకూ డీఎస్సీ నిర్వహించకుండా కోచింగ్ సెంటర్లలో మగ్గుతున్న యువతకు చుక్కలు చూపుతున్నారు. ప్రభుత్వం టెట్‌తో సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మోసం చేయడం బాబుకు అలవాటే..



నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేయడం చంద్రబాబుకు పారిపాటి మారింది. ఇదే హామీ 2014లో కూడా ఇచ్చారు. ఏనాడూ ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చిన పాపానపోలేదు. నిరుద్యోగు జీవితాలతో ఆటలాడుకోకుండా ఉద్యోగాలు వచ్చే వరకూ నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు చెల్లించాలి.

– అబ్దుల్ బాసిద్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు, గుంతకల్లు

డీఎస్సీ అభ్యర్థులను మభ్యపెట్టారు



ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌పైనే అని నిరుద్యోగులను మభ్యపెట్టారు. హైదరాబాదు, అనంతపురం వంటి నగరాల్లో డీఎస్సీ కోచింగ్‌కు వేలాది రూపాయాలు ఖర్చు చేశాను. కూటమి అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా డీఎస్సీని వాయిదా వేస్తూ మోసం చేస్తున్నారు.

– బీ.శ్రీకాంత్, డీఎస్సీ అభ్యర్థి, గుంతకల్లు

ఎన్నికల హామీలు అమలు చేయాలి



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలి. ఇంటికో ఉద్యోగంతోపాటు ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి. ముఖ్యంగా నిరుద్యోగులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇస్తే ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లుకు వెళ్లే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది.

– వినోద్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు, గుంతకల్లు

కూటమి కొలువయ్యాక విద్యావ్యవస్థ నాశనం


పామిడిలో యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


యాడికిలో కరపత్రాలు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పామిడి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువయ్యాక విద్యా వ్యవస్థ నాశనమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు నక్కా నారప్ప మండిపడ్డారు. పామిడిలో మంగళవారం యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు కింద రూ.3,600 కోట్ల బకాయిలు విడుదల చేయాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి కింద ప్రతి ఒక్క నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అనంతపురంలో చేపట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, వైఎస్ అభిమానులు, ప్రజలు పెద్దెత్తున తరలిరావాలన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, బోయ నరసింహ, గొర్ల సుంకన్న, నీలకంఠారెడ్డి, జనార్దన్‌రెడ్డి, శివ, పుంజా నగేష్‌యాదవ్, ధనుంజయరెడ్డి, రామాంజనేయులు, హరీష్, దేవరాజు పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిరండి

శింగనమల: విద్యార్థులను, యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు బుధవారం అనంతపురంలో వైఎస్సార్‌సీపీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు నాయక్ కోరారు. ఎన్నికల్లో అమలు చేయలేని హామీలిచ్చిన కూటమి పార్టీలు , అధికారంలోకి వచ్చిన వెంటనే విస్మరించాయన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

పెద్దవడుగూరు(యాడికి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ యాడికి మండల కన్వీనర్ సంజీవరాయుడు మండిపడ్డారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తలపెట్టిన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. మండల నాయకులు కేశవరెడ్డి, రాజారెడ్డి, అజయ్‌రామిరెడ్డి, రామ్మోహన్, నారాయణస్వామి, గుర్రప్ప, నారాయణరెడ్డి, రామాంజిరెడ్డి, లక్ష్మీరెడ్డి, బుజ్జీ, నారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు


మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి

శింగనమల: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలను తీసుకోవాలని ఎంపీపీ యోగేశ్వరి సూచించారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ అన్వేష్ మాట్లాడుతూ పంటల సాగు, ప్రభుత్వ సబ్సిడీ పథకాలను వివరించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ గ్రామాల్లో భూసర్వే వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మట్లగొంది గ్రామాన్ని రీ–సర్వే ప్రాజెక్టు కింద ఎంపిక చేయడంతో రీసర్వే చేపట్టామన్నారు. ఎంపీడీఓ భాస్కర్ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

టైలరింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోండి

పామిడి: ప్రభుత్వం కల్పించిన ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కే తేజోత్స్న మంగళవారం తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు కులాలకు చెందిన మహిళలకు శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు అందజేస్తారన్నారు. ఇందుకు 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు అర్హులన్నారు. ఈనెల 22లోపు సంబంధిత సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు పరిగణనలోకి తీసుకుని కుట్టుమిషన్లు అందజేస్తారన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దవడుగూరు(యాడికి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వేదరాజ్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి లో 43 మంది గర్భిణుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ సరోజమ్మ, ఆస్పత్రి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు నాణ్యమైన భోజనం పెట్టాలని, క్యాంటీన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, సచివాలయ హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

బుక్కరాయసముద్రం: బాలికలకు చిన్న వయస్సులో పెళ్లి చేస్తే చాలా ప్రమాదకరమని మండల వైద్యురాలు డాక్టర్ తెహరున్నీసా పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేసినట్లయితే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి, ఆరోగ్య ఎడ్యుకేటర్ పర్వీన్, ఎంహెచ్‌ఓ మోహన్ రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, మహిళా పోలీస్ అసిస్టెంట్ చంద్రకళ, జయంతి, అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల ద్వారం లేని గొర్రె పిల్లకు శస్త్ర చికిత్స

శింగనమల: మండలంలోని వెస్ట్ నరసాపురంలో గొర్రెల కాపరి బండి నాగార్జునకు చెందిన గొర్రె పిల్లకు మల ద్వారం లేకపోవడంతో శింగనమల పశుసంవర్ధక సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం మంగళవారం శస్త్ర చికిత్స చేసి మలద్వారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రంగనాయకమ్మ, చంద్రశేఖర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పుట్లూరు: మండలంలోని నారాయణపల్లికి చెందిన పర్వతాలు అనే వ్యక్తిని కులం పేరుతో దుషించాడని మద్దిపల్లికి చెందిన నారపరెడ్డిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. వివరాలు.. పర్వతాలు గొర్రెల వ్యాపారం చేస్తుండగా నారపరెడ్డి అనే వ్యక్తి అతని వద్ద నుంచి 14 గొర్రెలను రూ.1.90 లక్షలకు కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన వెంటనే రూ.90 వేలు చెల్లించి మిగిలిన డబ్బు ఇవ్వడంలో జాప్యం చేయడంతో మద్దిపల్లికి వెళ్లి డబ్బు ఇవ్వాలని అడిగిన పర్వతాలును కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 84మంది పదో తరగతి విద్యార్థులకు మంగళ వారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం సుంకన్న మాట్లాడుతూ 2003 నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ గట్టు రామకృష్ణారెడ్డి పదో తరగతిలో ఫస్ట్ మార్కులు సాధించే విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు నగదు బహుమతి అందజేసి ప్రోత్సాహిస్తున్నారన్నారు. అదేబాటలో ఆయన కుమారులు గోవర్ధన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి గత నాలుగేళ్లుగా పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామగ్రి అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

గుంతకల్లుటౌన్: పీడిత ప్రజల హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించి అసువులు బాసిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగిస్తామని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సుభాష్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లర్పించారు. న్యూడెమోక్రసీ నాయకులు సత్తార్, రామాంజినేయులు, ఆశాబీ, మాబున్నీ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

అనంతపురం టవర్‌క్లాక్: మాపై దాడి చేసి, దౌర్జన్యంగా ఇల్లు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని పామిడికి చెందిన మహదేవయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పామిడిలో ఆరుగురు సోదరులకు కలిసి ఓ ఇల్లు ఉంది... ఆ ఇంటిని మాకు ఎవరికీ తెలియకుండా నాలుగో అన్న విక్రయించాడన్నారు. ఇల్లు కొన్నవారు వచ్చి, ఇల్లు ఖాళీ చేయాలని దురుసుగా ప్రవర్తించడంతో సోదరులంతా కలసి కోర్టును ఆశ్రయించామన్నారు. కేసు కోర్టులో ఉన్నా.. మాపై దాడి చేసి, దౌర్జన్యంగా ఇల్లు ఖాళీ చేయిస్తున్నారన్నారు. పామిడిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిపై చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన యువకులు శ్రీనివాసులు, రాహుల్ బైక్‌లో చెరువు కట్ట వద్దకు వెళుతుండగా.. అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

రెండిళ్లలో చోరీ

నార్పల: మండల కేంద్రంలో మంగళవారం రెండిళ్లలో చోరీలు జరిగాయి. నగల కొట్టు నిర్వహిస్తున్న లక్ష్మీనగర్ నివాసి శేషప్ప మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి తన భార్యను పిలుచుకుని అనంతపురానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తలుపులు తెరిచి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాను ధ్వసం చేసి అందులోని 5 కిలోల వెండి, మూడు తులాల బంగారు నగలను అపహరించినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే నార్పల క్రాసింగ్ సమీపంలో గాండ్ల మనోజ్ నిర్వహిస్తున్న భారతీ సిమెంట్స్ అంగడి తాళాలు బద్దలు గొట్టి 220 సిమెంట్ బస్తాలను అపహరించారు.సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ ఆయా ప్రాంతాలను పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మున్సిపల్ ఏఈ కోసం విస్తృత గాలింపు

గుంతకల్లు టౌన్: గుంతకల్లు మున్సిపాలిటీలో ఏఈగా పనిచేస్తున్న హరికృష్ణ కోసం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టారు. గతంలో హిందూపురం మున్సిపల్ ఏఈగా పనిచేసిన సమయంలో తనను ప్రేమించి పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ఓ మహిళా ఉద్యోగిని హిందూపురం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మూడు రోజులుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద తిష్టవేసి హరికృష్ణ కోసం ఆరా తీస్తున్నారు. ఈ కేసు విచారణను దిశ పోలీస్‌స్టేషన్ అధికారికి అప్పగించినట్లు వెల్లడించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్ మాట్లాడుతూ... హరికృష్ణపై కేసు నమోదుదైన విషయం హిందూపురం పోలీసులు చెప్పిన తర్వాతనే తమకు తెలిసిందన్నారు. ప్రస్తుతం ఆయన ఐదారు రోజులుగా సెలవులో ఉన్నారన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లుటౌన్/బుక్కరాయసముద్రం: గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 7:30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ పార్టీ పతాకావిష్కరణ, కేక్ కటింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అనంతరం అనంతపురంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లనున్నట్లు వారు తెలిపారు. అలాగే బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయ ఆవరణంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీకేఎస్ జెడ్పీటీసీ నీలం భాస్కర్ తెలిపారు.

ఘనంగా మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ హోమాన్ని నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

తాడిపత్రిటౌన్ (పెద్దపప్పూరు): పెద్దపప్పూరు మండలం కొట్టాలపల్లిలో మంగళవారం మండలంలోని పసలూరు, గార్లదిన్నె, కొట్టాలపల్లి ఎస్సీ రైతులకు ఉద్యానశాఖ అధికారులు పండ్ల తోటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ శ్రీనివాసుల నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అరటి పంటకు వ్యాపించే సిగటోకమచ్చల తెగులుపై అవగాహన కల్పించారు. అలాగే మామిడి, నిమ్మ తోటల్లో కాయలు చిన్నగా ఉన్నప్పుడే తొడిమ వరకు గాలిదూరకుండా కవర్లు కడితే ఊజీ ఈగ, తేనే మంచు పురుగు, మచ్చలు, తామర పురుగు నుంచి రక్షణ కల్పించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, రైతు సేవాకేంద్రం అధికారి ప్రవీణ, వీహెచ్‌పీ హరినాథ్, ఎంపీఈఓ మునేంద్ర పాల్గొన్నారు.

బ్యూటీషియన్‌కు పురస్కారం


అవార్డు అందుకుంటున్న బ్యూటీషియన్ లలిత

గుంతకల్లు: పట్టణానికి చెందిన బ్యూటీషియన్ లలిత లింగట్లుకు జాతీయ స్థాయిలో బెస్ట్ బ్యూటీషియన్ అవార్డు దక్కింది. మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో హైపెడ్జ్, షీ ఇన్‌స్పైర్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు ఎంపిక చేసి జాతీయస్థాయి అవార్డులను అందజేశారు. ఇందులోభాగంగా గుంతకల్లు న్యూలుక్ బ్యూటీషియన్ సెలూన్ నిర్వాహకురాలు లలితకు బెస్ట్ కాస్మెటాలజిస్ట్ అండ్ బ్యూటీషియన్ అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు.

హనుమద్ వాహనంపై లక్ష్మీ చెన్నకేశవస్వామి



పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికిలో వెలసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మంగళవారం దేవేరులతో కలసి భక్తులకు హనుమద్ వాహనంపై శ్రీవారు దర్శనమిచ్చారు.

కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని పరిరక్షించుకుందాం

పుట్లూరు: అవదూత కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని పరిరక్షించుకోవడానికి పోస్టు కార్డులను ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు పంపనున్నట్లు భాగవత భక్త సమాజ సభ్యుడు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తక్కళ్లపల్లిలో నిర్వహించిన భాగవత సప్తహ పఠనం కార్యక్రమంలో తీర్మానం చేశామన్నారు. కులమతాలు చూడకుండా, ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసే మహోన్నత క్షేత్రాన్ని కూల్చడం అన్యాయమన్నారు.

తూనికల కొలతల శాఖ అధికారి తనిఖీలు

గుంతకల్లు టౌన్: పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ నేతృత్వంలో సిబ్బంది మంగళవారం తనిఖీలు చేపట్టారు. తూకాలకు ముద్రలు వేయించని మొత్తం 18 చేపలు, చికెన్, మటన్, రేషన్, కిరాణా షాపు దుకాణాల యజమానుల నుంచి రూ.12,400 జరిమానా వసూలు చేశారు. తనిఖీల్లో తూనికల కొలతల శాఖ సిబ్బంది షంషేర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.